# వేములవాడ వార్త

మీకోసం మా అక్షరం

Telugu Daily

కరీంనగర్
సంపుటి: 09
సంచిక: 16
శనివారం
10 అక్టోబర్ 2026
పేజీలు: 04

Karimnagar, Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad www.vemulawadavaartha.in


## రైతులకు అండగా సింగిల్ విండో పాలకవర్గాలు పనిచేయాలి: ఆది



3






# ఢిల్లీలో హై అలర్ట్!

## నేడు సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనకు పిలుపు



### సీజేపీ నిరసనకు పోలీసుల బ్రేక్

- జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు అనుమతి నిరాకరణ
- 20 వేల మందికిపైగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు
- కీలక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనలు రద్దు

2

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతాపార్టీ, పలు విద్యార్థి సంఘాలు జంతర్‌మంతర్ వద్ద నేడు తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, కేవలం మూడ్రోజుల ముందు అంటే అక్టోబర్ 7నే దరఖాస్తు సమర్పించారని పోలీసులు తెలిపారు. గతసారి ఆందోళనల్లో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన చరిత్ర కూడా ఉందని స్పష్టంచేశారు. శాంతిభద్రతల దృష్ట్యా న్యూఢిల్లీ జిల్లా అంతటా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు.



## ఓట్ల చోరీపై రాష్ట్రపతికి ఇండియా కూటమి ఫిర్యాదు

- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే
- ఎస్ఐఆర్ నిలిపివేయాలని విజ్ఞప్తి
- 13.30 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలి
- బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలని కోరిన నేతలు

**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల్లో అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పెద్ద తప్పు చేశారని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సీఈసీ కలిసి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశాలపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ప్రియాంకా గాంధీ తదితరులు మీడియాతో మాట్లాడారు. ఓట్ల చోరీకి సంబంధించిన అంశాలను రాష్ట్రపతికి వివరించామని రాహుల్‌గాంధీ తెలిపారు. ఎక్కడెక్కడ అక్రమాలు జరిగాయో ఆధారాలు అడిగారని, ఓట్ల చోరీపై ఆలోచించి చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి హామీ ఇచ్చారని చెప్పారు. ఎన్నికలను బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహించాలని కోరినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ప్రజలకు తెలుసని, సీఈసీ కార్యాలయం నుంచే ఈ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓట్ల చోరీలో మోడీ కీలక పాత్ర పోషిస్తుండగా, అమిత్‌షా, జ్ఞానేశ్‌కుమార్ దాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు.

### ఎన్నికల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్రపతికి వినతిపత్రం అందజేసి ఓట్ల చోరీకి సంబంధించిన వివరాలను తెలియజేశామని ఖర్గే చెప్పారు. ఈ అంశంపై సంబంధిత వర్గాలతో మాట్లాడతానని రాష్ట్రపతి తెలిపినట్లు వెల్లడించారు. హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. బీజేపీ ఈవీఎంలు, ఓటర్ల జాబితాలను తారుమారు చేసిందని తరువాయి 2లో

## నవీ పిళ్లైకి నోబెల్ శాంతి పురస్కారం



- అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కుల పరిరక్షణకు కృషికి గుర్తింపు
- ఐరాస మానవ హక్కుల హైకమిషనర్‌గా సేవలు
- తమిళనాడు నుంచి దక్షిణాఫ్రికాకు పూర్వీకుల వలస

2

## ముగిసిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్




- 97 శాతం ఓటింగ్.. 33,973 మంది ఓటు
- రాష్ట్రవ్యాప్తంగా 115 కేంద్రాల్లో పోలింగ్
- 17న అధికారికంగా ఫలితాల ప్రకటన



# ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలి

- రద్దీ ప్రాంతాల్లో పీఆర్‌టీఎస్ ఏర్పాటుకు కసరత్తు
- ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలని నిర్దేశం
- ముంబయిలో వినియోగిస్తున్న సాంకేతికతపై అధ్యయనం చేయండి
- క్యూర్ పరిధిలో పనుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్‌లో రవాణా వ్యవస్థ మెరుగుదలకు సీఎం ఆదేశాలు

2

రాజధాని హైదరాబాద్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారుల అనుసంధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

## ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- అధికార పక్షానికి రక్షణ కవచంగా మారొద్దు
- ఓటర్ల జాబితా సవరణపై హరీశ్‌రావు ఫైర్



2



## భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

2

- 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూ పునసర్వే
- ఏడు జోన్లుగా రాష్ట్ర విభజన.. పర్యవేక్షణకు 14 మంది అధికారులు
- నవంబర్ చివరికి తొలి దశ పూర్తి.. ఏడాదిన్నరలో మొత్తం సర్వే
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## ప్రతి ఇంటికీ పాంచజన్యం తీసుకెళ్లండి

- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి
- తెలంగాణ రక్షణ సేన శ్రేణులకు కవిత పిలుపు
- రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నేతలకు దిశానిర్దేశం
- తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే ఆటాపాటల సాంస్కృతిక వైభవం బతుకమ్మ అని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




2



## బండి సాయి భగీరథ్‌కు హైకోర్టులో ఊరట

- పోక్సో కేసుపై ప్రసారాలు నిలిపివేయాలని ఆదేశం
- సంబంధిత కంటెంట్ తొలగించాలి
- డిజిటల్ రికార్డులు భద్రపరచాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

2

## నేటి నుంచి 9 రోజులపాటు పూల పండగ

- ప్రత్యేక లోగో రూపొందిస్తున్న ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల ఏర్పాట్లు
- 18న రాజధానిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

2

రాష్ట్ర సంస్కృతికి ప్రతీక, మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగ శనివారం ప్రారంభం కానుంది. రాజధాని హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వేడుకలను ఈ నెల 18 వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నారు. సచివాలయం, లోక్‌భవన్, శాసనసభ, మండలి సహా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ సందడి నెలకొననుంది.



## సర్ అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి

- సీఈసీ రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓట్ల తొలగింపు జరిగింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం ఎదుట నిరసనకు బీఆర్ఎస్ పిలుపు



## హైస్పీడ్ రైల్ ఎలైన్‌మెంట్లు ఖరారు కాలేదు

- మూడు కారిడార్ల మార్గం అధ్యయనంలోనే ఉంది
- రాష్ట్రాలకు భూసేకరణ ప్రతిపాదన పంపలేదు
- కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి

2

**హైదరాబాద్, వీవీన్యూస్:** హైస్పీడ్ రైల్ కారిడార్ల కోసం భూసేకరణ చేయాలని కేంద్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంతవరకు ప్రతిపా దనలేవీ పంపలేదని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరా బాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్ –పుణె–ముంబయి.. ఈ మూడు హైస్పీడ్ రైలు కారి డార్లకు సంబంధించిన ఎలైన్‌మెంట్లపై ప్రస్తుతం అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కిషన్‌రెడ్డి దిల్లీలోని రైల్ భవన్‌లో అశ్విని వైష్ణవ్‌తో శుక్రవారం సమావేశ మయ్యా రు. ఈ వివరాల్ని కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే ఎక్స్‌లో వేర్వేరుగా పోస్టు చేశారు. హైదరాబాద్–బెంగళూరు సహా మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఎలైన్‌మెంట్లకు తరువాయి 2లో

## ఓట్ల చోరీపై రాష్ట్రపతికి ఇండియా కూటమి ఫిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు.ముఖ్యంగా ఇండియా కూటమి ప్రధాన డిమాండ్లు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి. సీఈసీ, ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన 13.30 కోట్ల మంది పేర్లను వెంటనే తిరిగి చేర్చాలి. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలు సమర్పించిన గత రెండేళ్ల అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి.రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఇండియా కూటమి నేతలు విజ్ఞప్తి చేశారు.

## ముగిసిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ముగిసింది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 97 శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 115 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 34,889 మంది ఓటర్లకుగాను 33,973 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### గ్రేటర్‌లో 98 శాతం పోలింగ్

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా 98 శాతం పోలింగ్ నమోదుకాగా, కరీంనగర్‌లో 97 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల్లో ఏ యూనియన్ విజయం సాధిస్తుందనే దానిపై అర్ధరాత్రికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. విజేతపై ఈ నెల 17న అధికారిక ప్రకటన వెలువడనుంది.

## హైస్పీడ్ రైల్ ఎలైన్‌మెంట్లు ఖరారు కాలేదు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి తెలంగాణలో క్షేత్ర స్థాయిలో చేసిన మార్కింగ్ పనులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. చాలామంది రైతులు తనను కలుస్తున్నారని కిషన్‌రెడ్డి రైల్వే మంత్రికి వివరించారు. తొలుత సూర్యాపేటతో కలిపి ప్రాథమిక ఎలైన్‌మెంట్ ఉండగా తర్వాత మార్చారని.. తమకూ హైస్పీడ్ రైలు కావాలంటూ ఆ జిల్లా నుంచి ప్రజలు వచ్చి కలుస్తున్నారని తెలిపారు. భూసేకరణ అంశంపై ఆందోళనతో ఉన్న రైతులు.. పోలీసు అధికారిపై కారంపొడి చల్లిన సంఘటన కూడా చోటుచేసుకుందని చెప్పారు. మూడు కారిడార్ల ఎలైన్‌మెంట్ అధ్యయనాల పురోగతిని రైల్వే మంత్రి వివరించారని కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎలైన్‌మెంట్ ఖరారైన తరువాతే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు, రైతులకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కేంద్రం ఖారారు చేయకుండా రైతుల నుంచి భూములను సేకరిస్తే అది చట్టవిరుద్ధమవుతుందని పేర్కొన్నారు.

## ప్రతి ఇంటికీ పాంచజన్యం తీసుకెళ్లండి

**హైదరాబాద్, వీవీన్యూస్:** తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతమైన 'పాంచజన్యాన్ని' ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని సూచించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో రైతులకు అన్యాయం చేస్తున్న దళారుల వ్యవహారాన్ని పార్టీ నాయకత్వం ప్రశ్నించిందని కవిత తెలిపారు. దీంతో ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు రైతులకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఏడాది పొడవునా పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలపై సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే ఆటాపాటల సాంస్కృతిక వైభవం బతుకమ్మ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండగను ఆడపడుచులందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ఈ భేటీలో పార్టీ సీనియర్ నాయకులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## సర్' అక్రమాలపై సుప్రీంకోర్టు విచారణ జరపాలి

**హైదరాబాద్, వీవీన్యూస్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని కోరారు. శుక్రవారం 'ఎక్స్' వేదికగా ప్రకటన విడుదల చేశారు.భారత రాజ్యాంగానికి మించినది ఏదీ లేదని, ఏ ఒక్క పౌరుడి ఓటు హక్కును హరించడానికి వీల్లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక వ్యక్తిని కాపాడేందుకు 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును బలహీనపరిచే చర్యలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజ కవర్గాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించారని కేటీఆర్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నేడు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులోఢిల్లీకి విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

## భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

**హైదరాబాద్, వీవీన్యూస్:** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర భూ పునఃసర్వేను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. సుమారు 125 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ సర్వేను పారదర్శకంగా, కచ్చితత్వంతో పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. తొలి దశలో 2,768 గ్రామాల్లో చేపట్టిన సర్వేలో ఇప్పటివరకు 245 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. నవంబర్ చివరి నాటికి తొలి దశను పూర్తి చేయాలని, మొత్తం సర్వేను ఏడాదిన్నరలో ముగించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. సచివాలయంలో శుక్రవారం సర్వే పురోగతిపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.భూ సర్వే పనులను వేగవంతం చేయడంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పటిష్ఠం చేసేందుకు రాష్ట్రాన్ని ఏడు జోన్లుగా విభజించారు. రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఒక్కో జోన్‌కు ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో లైసెన్స్‌డ్ సర్వేయర్‌తోపాటు జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బంది ఉంటారు. సర్వే జరుగుతున్న గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. రోజువారీగా ఎన్ని ఎకరాలు, ఎన్ని సర్వే నంబర్లలో పనులు పూర్తయ్యాయి? ఎన్ని గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి? అనే వివరాలను సేకరించాలని సూచించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా భూముల హద్దులు, రికార్డులను కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మళ్లీ వివాదాలు తలెత్తకుండా సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. సర్వే పనులను రాష్ట్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల వారీగా సర్వే వివరాలు, రోజువారీ పురోగతి, పనిచేస్తున్న బృందాలు, రోవర్ల వినియోగం, వాటి లొకేషన్ వంటి సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించనున్నారు.రీసర్వే పేరుతో ప్రజల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేసినా, వారిని ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని హెచ్చరించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలి



**హైదరాబాద్, వీవీన్యూస్:** రాజధాని హైదరాబాద్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు అవసరాల కు అనుగుణంగా క్యూర్ పరిధిలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారుల అనుసంధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్) ఏర్పాటుకు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని నిర్దేశించారు. ప్రజా రవాణా, రహదారుల అనుసంధానం, శుద్ధి చేసిన నీటి పునర్వి నియోగంపై శుక్రవారంఆయన సమీక్ష నిర్వహించారు.

### మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లకు అనుసంధానం

నగరంలో ఎక్కువ మంది రాకపోకలు సాగించే ప్రాంతాలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడేలా పీఆర్‌టీఎస్ ఉండాలని సీఎం సూచించారు. మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లకు అనుసంధానించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్‌టీఎస్ వ్యవస్థలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మార్గాల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం పెంచేందుకు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే విధానంతో ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యుటిలిటీల తరలింపును త్వరగా పూర్తి చేసి, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు.

### ఫ్లైఓవర్ పనుల్లో వేగం పెంచాలి

నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వైపు చేపట్టిన ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముంబయి వంటి నగరాల్లో పైవంతెనల నిర్మాణాన్ని ఏడాదిలోనే పూర్తి చేస్తున్నారని, అక్కడ అనుసరిస్తున్న సాంకేతికత, నిర్మాణ విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు.హైదరాబాద్–ముంబయి బుల్లెట్ రైలు మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు నిర్దేశించారు. శంకర్‌పల్లి–చేవెళ్ల మధ్య ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణతో పాటు కొత్త రహదారుల నిర్మాణానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

### శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం

శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించే ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. 500 ఎంఎల్‌డీ రీసైకిల్ నీటి వినియోగానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి, ఆలూరులోని డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలకు శుద్ధి చేసిన నీటిని అందించేలా పనులు చేపట్టాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎత్తైన భవనాల నిర్మాణం, ల్యాండ్‌స్కేపింగ్, పార్కుల్లోనూ ఈ నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### వివిధ శాఖల మధ్య సమన్వయం

క్యూర్ చట్టం అమలులో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, వాటర్‌బోర్డు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కార్యాలయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

ఈ సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా, మెట్రో) ఎన్‌వీఎస్ రెడ్డి, హైదరాబాద్ మెట్రోరైలు అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్‌రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్‌కృష్ణారెడ్డి, వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది



**హైదరాబాద్, వీవీన్యూస్:** భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక వంటి ఎన్నికల సంఘం (ఈసీ) అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంగా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### ఓట్ల తొలగింపుతో నమ్మకం సన్నగిలింపు

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలతో ఎన్నికల సంఘం పనితీరుపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పనితీరు, కమిషనర్ల నియామకాలపై తలెత్తుతున్న ప్రశ్నలు రాజ్యాంగ వ్యవస్థ పునాదులను బలహీనపరిచే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైతే సీఈసీ పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. రాజ్యాంగంలోని 324, 325, 326 అధికరణాలు స్వేచ్ఛాయుత, నిష్పక్ష పాత ఎన్నికల నిర్వహణకు ప్రాధాన్యమిస్తాయని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

## ఢిల్లీలో హైఅలర్ట్!



**న్యూఢిల్లీ:** సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ జనతాపార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి,పలు విద్యార్థి సంఘాలు జంతర్‌మంతర్ వద్ద ఇవాళ తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, కేవలం మూడ్రోజుల ముందు అంటే అక్టోబర్ 7నే దరఖాస్తు సమర్పించారని పోలీసులు తెలిపారు. గతసారి ఆందోళనల్లో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన చరిత్ర కూడా ఉందని స్పష్టంచేశారు. శాంతిభద్రతల దృష్ట్యా న్యూఢిల్లీ జిల్లా అంతటా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. నిరసనల్లో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనే అవకాశం ఉండటంతో 20 వేల మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించినట్లు సమాచారం. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లను రద్దు చేసుకుని భద్రతా పరిస్థితులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీతో పాటు పొరుగు రాష్ట్రాల్లో పరిస్థితిని ఆయన రెండ్రోజులుగా ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

### సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం

ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో జంతర్‌మంతర్ వద్దకు చేరుకునే అవకాశముండటంతో దిల్లీ సరిహద్దుల్లో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. జంతర్‌మంతర్ వద్ద సీజేపీ నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఆందోళనకారుల కదలికలను పర్యవేక్షించేందుకు సీసీటీవీ కెమెరాలతో పాటు ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) కెమెరాలను ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల వద్ద భద్రతను పెంచారు. నిరసనల్లో ఆందోళనకారుల ముసుగులో నేరస్థులు చొరబడకుండా భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులపైనా నిఘా ఉంచాయి.

### 57 మెట్రో స్టేషన్ల మూసివేతకు ప్రతిపాదన

మూడు రోజుల పాటు నిరసనలు జరిగే అవకాశం ఉందన్న అంచనాలతో ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని మెట్రో రైల్ కార్పొరేషన్‌ను పోలీసులు కోరినట్లు సమాచారం. శనివారం న్యూదిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ల మధ్య కొన్ని గంటల పాటు రైళ్ల రాకపోకలను నిలిపివేసే అవకాశముందని తెలుస్తోంది. అయితే ఈ చర్యలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

### సీఈసీ నివాసం వద్ద జడ్+ భద్రత

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద జడ్+ భద్రత కల్పించారు. అదనపు భద్రతా సిబ్బందిని కూడా మోహరించారు. మరోవైపు, ఢిల్లీలో నిరసనల్లో పాల్గొనేందుకు వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పూర్, భోపాల్ రైల్వే స్టేషన్లలో పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ ఆరోపించింది.

## ఫైటర్ జెట్ నడిపిన థాయ్ రాణి!

- సోలో ఫ్లైట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సుథీదా
- భార్య సాహసాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన రాజు వజ్రాలాంగ్‌కోర్న్



**భూటాన్:** సాధారణంగా రాజకుటుంబ సభ్యులు విలాసవంతమైన జీవనశైలికి, కట్టుదిట్టమైన భద్రతకు పరిమితమవుతుంటారు. అయితే థాయ్‌లాండ్ రాజదంపతులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రాజ్య బాధ్యతలను నిర్వర్తిస్తూనే సాహసోపేతమైన విమానయానంలోనూ తమ నైపుణ్యాన్ని చాటుకుంటున్నారు. ఇప్పటికే రాజు మహా వజ్రాలాంగ్‌కోర్న్ స్వయంగా విమానం నడిపి విదేశీ పర్యటనకు వెళ్లగా.. తాజాగా రాణి సుథీదా యుద్ధవిమానాన్ని నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. విమానయానంలో కఠిన శిక్షణ పొందుతున్న రాణి సుథీదా తాజాగా సింగిల్ సీట్ జేఏఎస్ 39సీ గ్రిపెన్ ఫైటర్ జెట్‌లో సోలో ఫ్లైట్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. థాయ్‌లాండ్‌లోని సూరత్ థాని ప్రావిన్స్‌లో ఉన్న వింగ్–7 వైమానిక స్థావరం నుంచి ఆమె ఈ ప్రయాణాన్ని చేపట్టారు. ఈ సాహసయానాన్ని రాజు మహా వజ్రాలాంగ్‌కోర్న్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఫ్లైట్‌ను విజయవంతంగా ముగించిన అనంతరం రాణిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అరుదైన ఘట్టానికి సంబంధించిన వీడియోను థాయ్ రాజకుటుంబం తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకుంది. దీంతో ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

### భూటాన్ పర్యటనలోనూ..

గతేడాది భూటాన్ పర్యటన సందర్భంగా రాజు మహా వజ్రాలాంగ్‌కోర్న్ రాజకుటుంబానికి చెందిన బోయింగ్ 737–800 విమానాన్ని స్వయంగా నడిపారు. ఆ సమయంలో రాణి సుథీదా కో–పైలట్‌గా వ్యవహరించారు. రాజు గతంలో థాయ్ సైన్యంలో కెరీర్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఎఫ్–5, ఎఫ్–16 యుద్ధవిమానాలతో పాటు బోయింగ్ 737–400 విమానాన్ని నడిపేందుకు అర్హత సాధించారు.రాణి సుథీదాకు కూడా విమానయాన రంగంలో విశేష అనుభవం ఉంది. 2010లో తొలిసారిగా పైలట్‌గా పనిచేసిన ఆమె.. ఇప్పటివరకు సుమారు 1,188 గంటల పాటు విమానాలను నడిపిన అనుభవాన్ని సంపాదించారు. తాజాగా ఫైటర్ జెట్‌లో సోలో ఫ్లైట్‌ను పూర్తి చేయడంతో ఆమె సాహసోపేతమైన ప్రయాణంలో మరో కీలక మైలురాయిని అధిగమించారు.

## బండి సాయి భగీరథ్‌కు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, వీవీన్యూస్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియా వేదికల్లో ప్రసారమవుతున్న కంటెంట్‌పై న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన అంశాలను ప్రసారం చేయవద్దని మీడియా సంస్థలు, ప్రైవేటు వ్యక్తులు, సోషల్ మీడియా ఖాతాదారులను ఆదేశించింది.

### పరువుకు భంగం కలుగుతోందని పిటిషన్

తనకు ఇప్పటికే రెగ్యులర్ బెయిల్ మంజూరైనప్పటికీ, కొన్ని టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియా ఖాతాలు కేసుకు సంబంధించిన అంశాలను ప్రసారం చేస్తూ తమ కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది.



### మీడియా ట్రయల్ చేస్తున్నారని వాదనలు

భగీరథ్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. పిటిషనర్ వ్యక్తిగత కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోక్సో కేసుతో ముడిపెట్టి ప్రసారం చేస్తూ మీడియా ట్రయల్ నిర్వహిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది వ్యక్తిత్వ హననానికి దారితీస్తోందని పేర్కొంటూ, ఇప్పటికే ఉన్న అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించి డిజిటల్ ఆధారాలను భద్రపరిచేలా ఆదేశించాలని కోరారు.

### గూగుల్, మెటా, ఎక్స్‌కు ఆదేశాలు

వాదనలు విన్న ధర్మాసనం.. కేసుకు సంబంధించిన కంటెంట్‌ను ప్రసారం చేయవద్దని ఆదేశించింది. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ సంస్థలు సంబంధిత కంటెంట్‌ను తొలగించి, డిజిటల్ రికార్డులను భద్రపరచాలని సూచించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కేంద్ర సమాచార, ఎలక్ట్రానిక్స్ శాఖలు, తెలంగాణ ప్రభుత్వం, డీజీపీ, సోషల్ మీడియా సంస్థలతో పాటు పలువురు ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది.

## నవీ పిళ్లైకి నోబెల్‌శాంతి పురస్కారం

**కేప్ టౌన్:** ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి దక్షిణాఫ్రికాకు చెందిన భారత మూలాలున్న నవనీతమ్ 'నవీ' పిళ్లై ఎంపికయ్యారు. శాంతి స్థాపన, అంతర్జాతీయ చట్టాల ప్రోత్సాహానికి ఆమె చేసిన కృషిని గుర్తిస్తూ నార్వే నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించినట్లు కథనంలో పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం అంతర్జాతీయ స్థాయిలో నవీ పిళ్లై విశేషంగా కృషి చేశారు. ఆమె పూర్వీకులు తమిళనాడు నుంచి దక్షిణాఫ్రికాకు వలస వెళ్లారు. నవీ పిళ్లై తల్లిదండ్రులు శాంతమ్మ నాయుడు, నారాయణస్వామి నాయుడు.నవీ పిళ్లై 2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా పనిచేశారు. అంతకుముందు 2003 నుంచి 2008 వరకు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. దక్షిణాఫ్రికాలో తొలి నల్లజాతి మహిళా న్యాయమూర్తిగా కూడా ఆమె గుర్తింపు పొందారు.



### శాంతికి అంతర్జాతీయ చట్టాలే పునాది

ప్రపంచవ్యాప్తంగా అనేక సంఘర్షణలను దౌత్యం, ఒప్పందాలు, చట్టపరమైన మార్గాల ద్వారా పరిష్కరించుకోవచ్చని నార్వే నోబెల్ కమిటీ అభిప్రాయపడింది. శాంతియుత ప్రపంచ నిర్మాణానికి అంతర్జాతీయ చట్టాలు పునాదిగా నిలుస్తాయని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ సంఘర్షణలు, సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ చట్టాల ప్రాధాన్యం మరింత పెరిగిందని వివరించింది.

## నేటి నుంచి 9 రోజులపాటు పూల పండగ

**హైదరాబాద్, వీవీన్యూస్:** రాష్ట్ర సంస్కృతికి ప్రతీక, మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగ నేడు ప్రారంభం కానుంది. రాజధాని హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వేడుకలను ఈ నెల 18 వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నారు. సచివాలయం, లోక్‌భవన్, శాసనసభ, మండలి సహా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ సందడి నెలకొననుంది. ఇంటింటా మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి... పసుపు, కుంకుమల తో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. గ్రామాల కూడళ్లు, ఆలయాల ప్రాంగణాలు, వేదికల వద్దకు ఊరేగింపుగా వెళ్లి... బతుకమ్మ ఆటపాటలతో అలరిస్తారు. రాత్రిపూట అందుబాటులో ఉన్న జలవనరుల్లో భక్తిగా నిమజ్జనం చేస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు, నానేబియ్యం, అట్ల, అలిగిన, వేపకాయ, వెన్నముద్దల బతుకమ్మల ఉత్సవాలు జరుగుతాయి. చివరిరోజు సద్దుల బతుకమ్మను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తోంది. డిసెంబరులో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమిట్ ముద్రను అందులో చేర్చనున్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల ఏర్పాట్లు

బతుకమ్మ నిర్వహణ కోసం ప్రభుత్వపరంగా పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సన్నాహాలు చేస్తున్నాయి. పండగ జరిగే ప్రాంతాలు, ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతుతోపాటు విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ ఈ ఉత్సవాల సందడి నెలకొంటుంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలోనూ తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఆధ్వర్యంలో ఇవాళ బహుజన బతుకమ్మ ఉత్సవాలు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతాయి. హైదరాబాద్‌లో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేల సంఖ్యలో మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ పైకి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద వేడుకల్లో పాల్గొంటారు. కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న బతుకమ్మ ఘాట్‌తోపాటు నెక్లెస్ రోడ్డులోనూ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

### సాంస్కృతిక వైభవం బతుకమ్మ: కేసీఆర్

రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే ఆటాపాటల సాంస్కృతిక వైభవం బతుకమ్మ అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ''పువ్వులనే దేవతగా కొలుస్తూ, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల బతుకమ్మ పండగ.. దేశంలోని అన్ని సాంప్రదాయ పండుగల్లో ప్రత్యేకమైనది. తెలంగాణ జీవన విధానానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సామాజిక సంస్కృతికి దర్పణంగా నిలిచే బతుకమ్మ పండగ.. తెలంగాణ ప్రజల జీవితంలో భాగమైంది. తెలంగాణ తొలి ప్రభుత్వం బతుకమ్మ పండుగకు రాష్ట్ర వేడుకగా హోదానివ్వడమే కాకుండా.. ఆడబిడ్డలకు కానుకగా బతుకమ్మ చీరలను పంపిణీ చేసే సాంప్రదాయాన్ని అమలు చేసింది'' అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండగను ఆడపడుచులందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు ఆకాంక్షించారు.

### పండగను అత్యంత వైభవంగా జరుపుకోవాలి: సీఎం

రాష్ట్రంలోని ఆడ బిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు 9 రోజులపాటు ఆడబిడ్డలందరూ ఆటపాటలతో అత్యంత వైభవంగా ఈ పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ''ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి.. గౌరమ్మను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ ప్రత్యేకత. ఇక్కడి ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ఐక్యతకు బతుకమ్మ పండుగ నిలువెత్తు నిదర్శనం. తెలంగాణ ఆత్మగౌరవానికి, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుంది'' అని తెలిపారు.



## రైతులకు అండగా సింగిల్ విండో పాలకవర్గాలు పనిచేయాలి

- ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా నిలవాలి
- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, వీవీన్యూస్:** నూతనంగా ఎన్నికైన సింగిల్ విండో సహకార సంఘం చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో వేములవాడ మండల ప్రాథమిక సహకార సంఘం నూతన చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులకు నిర్వహించిన అభినందన సభలో ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 22 గ్రామాలకు సేవలందించే సింగిల్ విండో సంఘానికి బాధ్యతలు చేపట్టిన చైర్మన్, పాలకవర్గ సభ్యులపై గురుతర బాధ్యత ఉందన్నారు. రైతులకు అవసరమైన సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

### పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు

పదవుల కోసం పలువురు ఆశావహులు పోటీపడినప్పటికీ, కొన్ని సందర్భాల్లో కొందరికే అవకాశం కల్పించాల్సి వస్తుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పదవులు దక్కని నాయకులు నిరుత్సాహపడవద్దని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తించి భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సీనియర్ నాయకుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక సమతుల్యతను పాటిస్తూ రైతులకు సేవ చేయాలనే తపన ఉన్నవారికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సుమారు 13 సింగిల్ విండో సహకార సంఘాలకు సంబంధించి ఇప్పటివరకు 12 చోట్ల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, పార్టీ కోసం పనిచేసిన నాయకులను గుర్తించి నియామకాలు చేపట్టినట్లు వివరించారు. మిగిలిన ప్రాంతంలోనూ ఏకాభిప్రాయంతో త్వరలో పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రతి నాయకుడి గౌరవాన్ని కాపాడుతూ అందరికీ తగిన అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.

### ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని ఆది శ్రీనివాస్ సూచించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఏ పంటలు సాగు చేయాలనే అంశంపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలని కోరారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించే ప్రయత్నాలు చేపట్టిందని తెలిపారు. మారుపాక రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలోనూ వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపికపై చర్చించినట్లు గుర్తుచేశారు. అయితే జూన్ చివరి నుంచి వర్షాలు కురవడంతో రైతులకు కొంత ఊరట లభించిందని, ఈసారి వరి సాగు చేసిన రైతులకు పంట చేతికందే అవకాశాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

### సన్నవడ్లకు రూ.500 బోనస్

సన్నవడ్లు సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. వరి ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు బోనస్ అందించడం ద్వారా రైతులకు అదనపు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో రైతులు సన్నవడ్ల సాగు చేపట్టారని, మార్కెట్‌లో మెరుగైన ధరలు లభించడం వారికి ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ప్రాధాన్యం ఇస్తోందని ఆది శ్రీనివాస్ అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించిన సమయంలో విమర్శలు వచ్చినప్పటికీ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ఆ నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా, వ్యవసాయం లాభసాటిగా మారేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు అవసరమైన సేవలను అందించడంలో సింగిల్ విండో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని, నూతన పాలకవర్గాలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**రాజన్న సిరిసిల్ల, వీవీన్యూస్:** వైద్య కళాశాల భవన నిర్మాణ పనులతోపాటు బాలుర, బాలికల వసతి గృహాలు, మెస్ తదితర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనాలు, బాలుర, బాలికల హాస్టళ్లు, ఇతర నిర్మాణ పనులను శుక్రవారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని, ఇంకా పూర్తి చేయాల్సిన నిర్మాణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాలికల వసతి గృహం పనులు పూర్తయ్యాయని, కాంపౌండ్ వాల్ నిర్మాణం కూడా పూర్తయిందని, బాలుర వసతి గృహాన్ని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భవనాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణాల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్ అండ్ బీ ఈఈ బీమ్లా నాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం

- చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో మోకాళ్ల శస్త్రచికిత్సలకు సీ–ఆర్మ్ యంత్రం అందుబాటులోకి
- వినికిడి పరీక్షలు, ఫిజియోథెరపీ సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్





**వేములవాడ, వీవీన్యూస్:** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు చిన్నారుల్లో పోషకాహార లోపాలు, పుట్టుకతో వచ్చే ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ ఏరియా ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రిలో బేరా యంత్రాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు పొందిన సుమారు 18 మంది చిన్నారులు శారీరక సమస్యల నుంచి కోలుకుని ప్రస్తుతం నడవగలుగుతున్నారని పలువురు తల్లిదండ్రులు తమ అనుభవాలను పంచుకున్నారు. పోషణ మాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, నువ్వులు, బాలామృతంతో తయారు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులను తల్లుల మాదిరిగా సంరక్షిస్తూ వారి ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అంగన్‌వాడీ భవనాలు, మహిళా స్వయం సహాయక సంఘాల స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నారని వివరించారు.

### ఆరోగ్య సమస్యలకు సకాలంలో చికిత్స

పిల్లల్లో వినికిడి లోపం, మాటలు రాకపోవడం, శారీరక ఎదుగుదల సమస్యలు తదితర లోపాలను చిన్న వయసులోనే గుర్తించి చికిత్స అందించడం ఎంతో ముఖ్యమని ఆది శ్రీనివాస్ తెలిపారు. గతంలో గుర్తించిన కొంతమంది చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని నిమ్స్, సరోజినీదేవి, ఈఎన్‌టీ ఆసుపత్రులకు పంపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పేదరికం కారణంగా చిన్నారులకు వైద్యం అందకుండా ఉండకూడదని, అవసరమైన వైద్య పరీక్షలు, ఫిజియోథెరపీ, ఇతర చికిత్సలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇందులో భాగంగా వేములవాడ ఆసుపత్రిలో ప్రత్యేక థెరపీ సేవలు అందించేలా చర్యలు చేపట్టామని, వినికిడి లోపాన్ని గుర్తించేందుకు అవసరమైన పరీక్షల నిర్వహణకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి సేవలను ప్రారంభించామని వివరించారు.

### మోకాళ్ల శస్త్రచికిత్సలకు సీ–ఆర్మ్ యంత్రం

వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో పేదలకు ఉచితంగా మోకాళ్లకు సంబంధించిన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ ఆపరేషన్లకు అవసరమైన సీ–ఆర్మ్ యంత్రం అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, తాజాగా యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన పేదలకు ఉచితంగా మోకాళ్ల శస్త్రచికిత్సలు అందిస్తున్నామని, వేములవాడ ఆసుపత్రిలో ఈ సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు విద్యుత్ బిల్లుల భారం లేకుండా ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. చిన్నారుల్లో ఏవైనా ఆరోగ్య సమస్యలు కనిపిస్తే తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది వెంటనే సంబంధిత వైద్యులకు తెలియజేయాలని, అవసరమైన వైద్య సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

### ప్రతి మంగళవారం 10 నిమిషాల కార్యక్రమం

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ‘ప్రతి మంగళవారం 10 నిమిషాలు’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలు, వసతుల మెరుగుదల, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణ, మౌలిక సదుపాయాల పెంపు వంటి అంశాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు ప్రతి నెలా క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకెళ్లి వారి ఎత్తు, బరువును నమోదు చేయించాలని సూచించారు. పిల్లల ఎదుగుదలకు అనుగుణంగా పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతంతోపాటు ఇతర పోషకాహార పదార్థాలను అందిస్తున్నారని, పిల్లలను క్రమం తప్పకుండా కేంద్రాలకు పంపితే పోషకాహారంతోపాటు ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా విద్యాబోధన కూడా అందుతుందని వివరించారు.

### తల్లులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గర్భిణులు, బాలింతలు, మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా పోషక విలువ లున్న ఆహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, మునగకాయలను ఆహారంలో భాగంగా చేర్చుకోవాలని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపాలు కనిపిస్తే సమీప అంగన్‌వాడీ కేంద్రానికి సమాచారం అందించాలని కోరారు. ఎదుగుదల లోపాలు, వినికిడి లేదా మాటల సమస్యలు, మేధో వికాస సమస్యలు, నడవలేకపోవడం, పుట్టుకతో వచ్చే లోపాలు, మెదడుకు సంబంధించిన సమస్యలు, రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలున్న పిల్లలను అంగన్‌వాడీ సిబ్బంది గుర్తించి వైద్యులకు సమాచారం అందించాలని సూచించారు. వైద్యులు అవసరమైన పరీక్షలు నిర్వహించి సమస్యలను గుర్తిస్తారని, ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా పిల్లలను వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తారని వివరించారు. అవసరమైన వారికి హైదరాబాద్‌లో ఉన్నత వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. తాను గతంలో ఆకస్మిక తనిఖీకి వచ్చినప్పుడు బేరా యంత్రం వినియోగంలో లేకపోవడాన్ని గుర్తించానని, అనంతరం ప్రత్యేక గది, ఇతర ఏర్పాట్లు చేయించి యంత్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీవో కేవీఎస్‌బీ కుమారి, డీఆర్‌డీవో లక్ష్మీ నారాయణ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కాన్షీరాం వర్ధంతి

**కోనరావుపేట, వీవీన్యూస్:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో బహుజనుల రాజకీయ సాధికారత కోసం జీవితాంతం కృషి చేసిన మాన్యశ్రీ కాన్షీరాం 20వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం విగ్రహావిష్కరణ అధ్యక్షుడు దొబ్బల స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ఉపసర్పంచ్ సాయి, వార్డు సభ్యులు బుర్ర రమేష్, విజయ్, కనకసిద్ధిరాములు, ప్రణీత భూమేష్, ప్యాక్స్ డైరెక్టర్ సంజీవ్, మాజీ సర్పంచ్ బాలరాజు, మాజీ ఎంపీటీసీ కాషవేణి మహేష్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు కచ్చకాయల మహేష్, బాలరాజు, దండు ప్రభాకర్, ఉప్పుల ఆంజనేయులు, సంజీవ్, రమేష్, దేవయ్య, లింగయ్య, దాసు, మహేష్, నరేష్, సందీప్, మధు, కార్తీక్‌తో పాటు కుల సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషిచేయాలి

ఎస్పీ మహేష్ బి. గితే



**సిరిసిల్ల, వీవీన్యూస్:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన 100 రోజుల త్రివర్ణ పతాక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రతి విద్యా సంవత్సరంలో 100 రోజుల పాటు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించడంతో పాటు దేశం పట్ల గౌరవం, బాధ్యతను పెంచుతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తించాలని, గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి వాటి నిర్మూలనకు సహకరించాలని కోరారు. ప్రతి విద్యార్థి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు. మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతరులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని హితవు పలికారు. సోషల్ మీడియా ద్వారా నకిలీ ఖాతాలు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, గిఫ్ట్ ఆఫర్లు, లక్కీ డ్రాల పేరుతో మోసాలు జరుగుతున్నాయని, విద్యార్థులు ఇలాంటి ప్రలోభాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాయి కిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ రఘునందన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాభావంపై ముందస్తు కార్యాచరణ చేపట్టాలి

- మండలాల వారీగా కరువు పరిస్థితుల అంచనా
- పంటలు, భూగర్భ జలాలు, తాగునీటిపై ప్రత్యేక నిఘా
- ప్రతి గ్రామంలో ఉపాధి పనులు విస్తరించాలి
- జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి




**కరీంనగర్, వీవీన్యూస్:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మండలాల వారీగా వర్షపాతం లోటును విశ్లేషించి, పంటల పరిస్థితి, భూగర్భ జలాల లభ్యత, తాగునీటి అవసరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలు, ఉపాధి హామీ పనుల అమలు, కరువు మండలాల గుర్తింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 శాతం లేదా అంతకంటే ఎక్కువ లోటు నమోదైన మండలాలను గుర్తించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉండగా, 320 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. వ్యవసాయ, ప్రణాళిక శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సాధారణ, తీవ్ర కరువు పరిస్థితులకు సంబంధించిన వివరాలను సేకరించాలని సూచించారు. వర్షాభావంతో పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉన్నందున సాగు విస్తీర్ణం తగ్గిన ప్రాంతాలు, ఎండిపోతున్న పంటలు, నీటి ఎద్దడికి గురవుతున్న పొలాలను గుర్తించాలని తెలిపారు. వ్యవసాయ గణాంకాలతో పాటు భూగర్భ జలాల స్థాయిని పరిశీలించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 12న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రులతో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి అవసరమైన సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేయాలని సంజయ్ జాజు సూచించారు. వర్షపాతం లోటు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ డిమాండ్‌తో పాటు ప్రభుత్వం తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై స్పష్టమైన వివరాలను అందించాలని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, మేధావులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే మార్గాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతు వేదికలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రజాప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు తగ్గే అవకాశమున్నందున గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ స్పష్టం చేశారు. వికసిత్ భారత్–గ్రామ్ జీ కార్యక్రమం కింద పనులను విస్తరించాలని సూచించారు. గత ఏడాది అక్టోబర్‌లో ఉపాధి పనులకు 24,750 మంది కూలీలు హాజరుకాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.35 లక్షలకు చేరినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి ఈ సంఖ్య ఐదు నుంచి ఏడు లక్షలకు పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది క్రియాశీల జాబ్‌కార్డు దారులు ఉండగా, ప్రస్తుతం 2.63 లక్షల మందికి మాత్రమే ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 60 మందికి పని కల్పించేలా, ప్రతి ఆవాస ప్రాంతంలోనూ ఉపాధి పనులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పనులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, గ్రామాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక నిర్వాహకుడిని నియమించి, మొబైల్ ఫోన్ ద్వారా హాజరు నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఉపాధి పనుల నిర్వహణలో సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, ములుగు జిల్లాలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయని పేర్కొంటూ, మిగతా జిల్లాలు కూడా అదే తరహాలో పనులను విస్తరించాలని సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం లక్ష్యంగా గ్రామాల్లో జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు. పొలాల కాలువల శుభ్రత, చెరువుల్లో పూడికతీత, సాగునీటి కాలువల మరమ్మతులు వంటి పనులను గుర్తించి ఉపాధి హామీ కార్యక్రమంతో అనుసంధా నించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తం గా 50 వేల ఫార్మ్ పాండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 33 వేల నిర్మాణా లు పూర్తయ్యాయని వెల్లడించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించడంతో పాటు గ్రామపంచా యతీల పరిధిలోని బోరుబావుల రీచార్జ్ పనులను అక్టోబర్ 25లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కార్యక్రమానికి అందుబాటులో ఉన్న సుమారు రూ.6,711 కోట్ల నిధులను నిబంధనలకు అనుగుణంగా వినియోగిం చాలని స్పష్టం చేశారు. నీటి సంరక్షణకు దోహదపడటంతో పాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాస్తవ సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నీటి లభ్యత, ఉపాధి అవసరాలు, వలసల పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ చిత్రా మిశ్రా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జలసిరి కార్యక్రమం కింద గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టడంతో పాటు ఇంటింటికీ ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రజలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సీపీఓ రామ్ దత్తా రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ‘ఫౌజీ’, ‘స్పిరిట్’ నుంచి స్పెషల్ అప్‌డేట్స్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు అదిరిపోయే వార్త అందుతోంది. ఆయన నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రాలు ‘ఫౌజీ’, ‘స్పిరిట్’ నుంచి అక్టోబర్ 23న ప్రత్యేక అప్‌డేట్స్ రానున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ఫౌజీ’ సినిమా విడుదల వాయిదా పడినట్లు చిత్రబృందం స్పష్టం చేసిన నేపథ్యంలో.. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ నుంచి ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న ‘స్పిరిట్’ నుంచి కూడా అదే రోజు అధికారిక పోస్టర్‌ను విడుదల చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో ఒకే రోజు రెండు సినిమాల నుంచి అప్‌డేట్స్ వస్తే అభిమానులకు డబుల్ ట్రీట్ అందినట్లేనని సినీ ప్రియులు భావిస్తున్నారు. ‘సీతారామం’ చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న హను రాఘవపూడి దర్శకత్వంలో ‘ఫౌజీ’ రూపొందుతోంది. 1940ల నాటి స్వాతంత్ర్య పూర్వ కాలం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మాతలు రవి శంకర్, నవీన్ యెర్నేని భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. తొలుత ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించినప్పటికీ.. తాజాగా విడుదల వాయిదా పడినట్లు వెల్లడించారు. దీంతో ప్రభాస్ అభిమానులు కొంత నిరాశకు గురయ్యారు. అయితే, విడుదల తేదీ వాయిదా పడినప్పటికీ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నారనే ప్రచారం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కలయికలో తెరకెక్కుతున్న ‘స్పిరిట్’పై కూడా భారీ అంచనాలు నెలకొన్నా యి. ఈ సినిమా నుంచి అక్టోబర్ 23న అధికారిక పోస్టర్‌ను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ రెండు సినిమాలకు అప్‌డేట్స్ ఒకే రోజు వెలువడితే సోషల్ మీడియాలో ప్రభాస్ అభిమానుల సందడి పెరిగే అవకాశం ఉంది. ‘ఫౌజీ’ గ్లింప్స్, ‘స్పిరిట్’ పోస్టర్ విడుదలకు సంబంధించి అధికారిక ప్రకటన కూడా వెలువడాల్సి ఉంది.



# ‘వెట్టువం’లో దుల్కర్ సల్మాన్..



కోలీవుడ్ విలక్షణ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా యాక్షన్ చిత్రం ‘వెట్టువం’పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆర్య, శోభితా ధూళిపాళ్ల, వి.ఆర్. దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే చాలా వరకు పూర్తయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సినిమా షూటింగ్ దాదాపు ముగిసిందని భావిస్తున్న తరుణంలో దర్శకుడు పా. రంజిత్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. చిత్రానికి మరింత ప్రత్యేకత తీసుకురావడంతో పాటు కథలో ఆసక్తికరమైన మలుపును జోడించే ఉద్దేశంతో మరో మూడు రోజుల పాటు అదనపు చిత్రీకరణ చేపట్టాలని చిత్రబృందం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ కూడా పాల్గొననున్నట్లు సమాచారం. తక్కువ నిడివి ఉన్నప్పటికీ కథపై గట్టి ప్రభావం చూపిన ఆ పాత్ర తరహాలోనే ‘వెట్టువం’లో దుల్కర్ సల్మాన్ క్యామియో కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. ఆయన పాత్ర సినిమా కథను కీలక మలుపు తిప్పడంతో పాటు ప్రేక్షకులకు ఉత్కంఠను కలిగిస్తుందని సినీ అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే, దుల్కర్ సల్మాన్ ఈ చిత్రంలో నటిస్తున్నారనే వార్తతో పాటు అదనపు షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# దుష్ప్రచారంతోనే నా కెరీర్ దెబ్బతింది..



ఒకప్పుడు బుల్లితెరపై స్టార్ యాంకర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఉదయభాను.. తన కెరీర్‌లో ఎదురైన చేదు అనుభవాలపై తాజాగా స్పందించారు. సుదీర్ఘ విరామం తర్వాత నిర్మాతగా మళ్లీ సినీ, వినోద రంగంలోకి అడుగుపెట్టిన ఆమె.. తన కెరీర్ దెబ్బతినడానికి ప్రతిభ లేకపోవడం కారణం కాదని, కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా చేసిన దుష్ప్రచారమే ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తనకు అవకాశాలు తగ్గిపోవడానికి దారితీసిన పరిణామా లను వెల్లడించారు. తనకంటూ సొంతంగా ‘ఉదయభాను ప్రొడక్షన్స్’ నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసిన ఆమె.. తొలి ప్రయత్నంగా ‘పంచనామా’ అనే వెబ్ సిరీస్‌ను నిర్మించారు. ఈ వెబ్ సిరీస్ ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ఉదయభాను.. గతంలో ఎదుర్కొన్న పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. ఓ సందర్భంలో టీవీ చానల్ ఎండీతో మాట్లాడుతున్న సమయంలో, పక్కనే ఉన్న మార్కెటింగ్ విభాగానికి చెందిన వ్యక్తి తన పారితోషికం గురించి తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపారు. ‘భాను గారు రూ.6 లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఆమె రెమ్యునరేషన్ చాలా ఎక్కువ’ అని సదరు వ్యక్తి చెప్పారని వెల్లడించారు. అయితే, తాను వాస్తవానికి అంత మొత్తం అడగలేదని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారాల కారణంగా తనకు రావాల్సిన అవకాశాలు చేజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మంచి డ్యాన్స్ నైపుణ్యాలు, యాంకరింగ్‌లో సుదీర్ఘ అనుభవం, ప్రేక్షకుల్లో గుర్తింపు ఉన్నప్పటికీ పలు టీవీ చానళ్లు తనను పక్కన పెట్టాయని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లినప్పటికీ, స్టేజ్‌పైకి వెళ్లే సమయానికి అవకాశం దక్కకపోవడంతో కారులోనే ఎదురుచూసి వెనుదిరగాల్సి వచ్చిందని చెప్పారు. వృత్తిపట్ల ఎంతో అంకితభావంతో పనిచేసినప్పటికీ తనకు క్రమశిక్షణ లేదంటూ కొందరు అసత్య ప్రచారాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కెరీర్ దెబ్బతినడంలో కొంతమంది పీఆర్వోల పాత్ర కూడా ఉందని ఉదయభాను ఆరోపించారు. ప్రతిభ, అనుభవం, ప్రేక్షకుల్లో ఆదరణ ఉన్నప్పటికీ తప్పుడు ప్రచారాల వల్ల అవకాశాలకు దూరమయ్యానని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

## సంక్రాంతి బరిలో
# వెంకీ, కళ్యాణ్ రామ్

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో, కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్న చిత్రం ‘జనవరి 12 విడుదల’. హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా తదుపరి షెడ్యూల్ ఊటీలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన నటీనటులతో పాటు సాంకేతిక బృందం కూడా పాల్గొంటోంది. తాజా షెడ్యూల్ పూర్తయ్యే సమయానికి సినిమా చిత్రీకరణ దాదాపు 85 శాతం ముగియనుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. దీంతో ఈ చిత్రం 2027 సంక్రాంతి విడుదలకు మరింత చేరువ కానుంది. ‘బావ బమ్మర్ది సౌజన్యంతో’ అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు జీ.వీ. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్తి స్థాయి వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచగా, తాజా షెడ్యూల్ ప్రారంభంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. అనిల్ రావిపూడి తనదైన కామెడీ, కుటుంబ భావోద్వేగాలతో ఈ సినిమాను మరో విజయవంతమైన చిత్రంగా నిలబెడతారని అభిమానులు ఆశిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి అనిల్ మామ ఖాతాలో మరో బ్లాక్‌బస్టర్ చేరడం ఖాయమంటూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

## దక్షిణాఫ్రికా దెబ్బకు
# ఆసీస్ విలవిల

- తొలి టెస్టులో మొదటిరోజు 187/6



**దర్బన్:** దక్షిణాఫ్రికా బౌలర్లు విజృంభించడంతో ఆస్ట్రేలియా తొలి టెస్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 187 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. వెలుతురు లేమి కారణంగా నిర్ణీత సమయానికి 24.4 ఓవర్ల ముందే ఆటను నిలిపివేశారు. మూడు టెస్టుల ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం కింగ్స్‌మీడ్‌లో ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకుంది. వియాన్ ముల్డర్ రెండు, మార్కో యాన్సెన్ ఒక వికెట్ తీయడంతో ఆసీస్ 24 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ట్రావిస్ హెడ్ (9), 2016 తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన నిక్ మాడిన్సన్ (0) నిరాశపరిచారు. స్టీవ్ స్మిత్ (25), మార్నస్ లబుషేన్ (37) మూడో వికెట్‌కు 60 పరుగులు జోడించినా, ఇద్దరూ వెనుదిరగడంతో ఆస్ట్రేలియా కష్టాల్లో పడింది. లబుషేన్‌ను ముల్డర్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. అనంతరం అన్రిచ్ నోర్జే వరుస బంతుల్లో అలెక్స్ క్యారీ (14), బ్యూ వెబ్‌స్టర్ (4)లను పెవిలియన్‌కు పంపాడు. ఒక దశలో 124 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను మాట్ రెన్షా (46 నాటౌట్), పాట్ కమిన్స్ (33 నాటౌట్) ఆదుకున్నారు. ఏడో వికెట్‌కు అజేయంగా 63 పరుగులు జోడించి జట్టును మెరుగైన స్థితికి చేర్చారు. 2025 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించిన దక్షిణాఫ్రికా ప్రస్తుత ఛాంపియన్‌గా బరిలోకి దిగింది. 2018 బాల్ ట్యాంపరింగ్ వివాదం తర్వాత ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికాలో టెస్టు పర్యటనకు రావడం ఇదే తొలిసారి.

# విండీస్ విధ్వంసం

- రెండో టీ20లో భారత్ చిత్తు
- 249 పరుగుల లక్ష్యాన్ని 18.3 ఓవర్లలోనే ఛేదించిన కరీబియన్లు
- శతకంతో చెలరేగిన కెప్టెన్ హోప్
- అర్ధ సెంచరీతో రాణించిన రూథర్‌ఫోర్డ్
- 5మ్యాచ్‌ల టీ20 సిరీస్ 1-1తో సమం





**రాంచీ:** భారత బౌలర్లపై వెస్టిండీస్ బ్యాటర్లు విరుచుకుపడ్డారు. కెప్టెన్ షాయ్ హోప్ (102 నాటౌట్), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (84) విధ్వంసక ఇన్నింగ్స్‌లతో రెండో టీ20లో భారత్‌పై విండీస్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 250 పరుగుల భారీ లక్ష్యాన్ని కరీబియన్లు 18.3 ఓవర్లలోనే ఛేదించారు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 1–1తో సమమైంది. ఛేదనలో హోప్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 45 బంతుల్లోనే తొమ్మిది సిక్సర్లు, ఆరు ఫోర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు రూథర్‌ఫోర్డ్ 37 బంతుల్లో 84 పరుగులతో భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. వీరిద్దరి ధాటికి విండీస్ రికార్డు స్థాయి ఛేదనతో విజయాన్ని అందుకుంది. మయాంక్ యాదవ్ మూడు వికెట్లు తీసినా భారత్‌ను ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. సంజూ శాంసన్ 41 బంతుల్లో 82 పరుగులతో మెరుపులు మెరిపించాడు. ఇషాన్ కిషన్ 22 బంతుల్లో 43, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 18 బంతుల్లో 40 పరుగులు చేయగా.. తిలక్ వర్మ 18 బంతుల్లో 44 పరుగులతో అజేయంగా నిలిచాడు. అయితే భారీ స్కోరు కూడా భారత్‌కు విజయాన్ని అందించలేకపోయింది. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్ నాలుగు ఓవర్లలో 24 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు.

# బంగ్లాతో తొలి పోరు

- ఈ నెల 27 నుంచి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ
- స్వర్ణ విజేతగా బరిలోకి దిగనున్న భారత జట్టు
- జలంధర్, మొహాలీ వేదికల్లో మ్యాచ్‌లు.. నవంబర్ 5న ఫైనల్



**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల హాకీ స్వర్ణ విజేత భారత్.. ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో తన తొలి మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఆడనుంది. అక్టోబర్ 27న పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ పోరు జరగనుంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు జరిగే ఈ టోర్నీకి జలంధర్, మొహాలీ ఆతిథ్యమివ్వనున్నాయి. ఐదుసార్లు టైటిల్ గెలిచిన భారత్.. మరోసారి విజేతగా నిలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. జలంధర్‌లోని ఒలింపియన్ సుర్జీత్ సింగ్ హాకీ స్టేడియంలో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం పోటీలు మొహాలీలోని ఒలింపియన్ బల్బీర్ సింగ్ సీనియర్ అంతర్జాతీయ హాకీ స్టేడియానికి మారతాయి. నవంబర్ 4న సెమీఫైనల్స్, నవంబర్ 5న కాంస్య, స్వర్ణ పతకాల కోసం మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్రారంభ వేడుకలు అక్టోబర్ 27న భారత్–బంగ్లాదేశ్ మ్యాచ్‌కు ముందు జరగనున్నాయి.

### భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్

భారత్‌తో పాటు మలేషియా, జపాన్, దక్షిణ కొరియా, చైనా, బంగ్లాదేశ్ టోర్నీలో పాల్గొంటాయి. లీగ్ దశలో ప్రతి జట్టు మిగతా ఐదు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. భారత్ లీగ్ మ్యాచ్‌లన్నీ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 27న బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడే భారత్.. 29న చైనాతో, 30న జపాన్‌తో, నవంబర్ 1న మలేషియాతో, 2న దక్షిణ కొరియాతో తలపడుతుంది. అక్టోబర్ 28, 31, నవంబర్ 3 తేదీల్లో విశ్రాంతి దినాలుగా నిర్ణయించారు. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో భారత్ అత్యంత విజయవంతమైన జట్టుగా నిలిచింది. 2011, 2016, 2023, 2024లో టైటిల్ సాధించగా.. 2018లో పాకిస్థాన్‌తో కలిసి సంయుక్త విజేతగా నిలిచింది. జపాన్‌లో ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్న భారత జట్టు.. ఈ టోర్నీలోనూ అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. మ్యాచ్‌ల షెడ్యూల్ ప్రకటించడంతో టోర్నీపై ఉత్కంఠ పెరిగిందని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ తెలిపారు. ఆసియా దేశాల జట్లకు పంజాబ్ స్వాగతం పలుకుతోందని, నాణ్యమైన హాకీ పోటీలు చూడాలని ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకటనతో టోర్నీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని హాకీ ఇండియా ప్రధాన కార్యదర్శి భోలా నాథ్ సింగ్ అన్నారు.

## ఐపీఎల్ 20వ సీజన్‌పై
# బీసీసీఐ కసరత్తు




- ఈనెల 15న కీలక భేటీకి ఏర్పాట్లు
- ఫ్రాంచైజీల యజమానులు, సీఈవోలు, రాష్ట్ర క్రికెట్ సంఘాలు, ప్రసార సంస్థలకు ఆహ్వానం
- గత సీజన్ల సమీక్ష.. 2027 నిర్వహణపై చర్చ

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 20వ సీజన్ నిర్వహణకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. వచ్చే ఏడాది జరగనున్న ఐపీఎల్ 2027 నిర్వహణ ప్రణాళికలపై చర్చించేందుకు ఈ నెల 15న ముంబైలో కీలక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ భేటీకి ఐపీఎల్ ఫ్రాంచైజీల యజమానులు, ఆయా జట్ల ముఖ్య కార్యనిర్వహణాధికారులు (సీఈవోలు), గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన రాష్ట్ర క్రికెట్ సంఘాలు, ప్రసార సంస్థల ప్రతినిధులను బీసీసీఐ ఆహ్వానించింది. గత సీజన్లలో ఎదురైన సమస్యలు, నేర్చుకున్న పాఠాలను సమీక్షించడంతో పాటు వివిధ వర్గాల ఆందోళనలు, సూచనలను చర్చించనుంది. ఐపీఎల్ నిర్వహణలో రాష్ట్ర క్రికెట్ సంఘాల పాత్ర కీలకమని బీసీసీఐ భావిస్తోంది. మ్యాచ్ రోజున సమన్వయం, స్టేడియాల్లో ఏర్పాట్లు, వేదికల నిర్వహణకు సంబంధించి సంఘాల అభిప్రాయాలను తెలుసుకోనుంది. 2027 సీజన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలపైనా సమావేశంలో చర్చించనుంది.

## 16 నుంచి భారత్–జింబాబ్వే
# మహిళల టీ20 సిరీస్

**రాయ్‌పూర్:** భారత్–జింబాబ్వే మహిళల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లకు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ ఆతిథ్యమివ్వనుంది. ఈ నెల 16 నుంచి 20 వరకు నయా రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రతి మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుందని ఛత్తీస్‌గఢ్ క్రికెట్ సంఘం డైరెక్టర్ విజయ్ షా శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో లావాదేవీలో గరిష్ఠంగా ఆరు టికెట్లు కొనుగోలు చేయవచ్చు. మూడు మ్యాచ్‌ల సిరీస్ టికెట్ ధర రూ.499గా, రెండు మ్యాచ్‌ల కాంబో టికెట్ ధర రూ.350గా నిర్ణయించారు. వ్యక్తిగత మ్యాచ్ టికెట్లు సిల్వర్ విభాగంలో రూ.2,000, గోల్డ్ రూ.2,500, ప్లాటినం రూ.3,500గా ఉన్నాయి. కార్పొరేట్ బాక్స్‌లో ఒక్క సీటుకు రూ.3,500, పూర్తి బాక్స్‌కు రూ.70,000 చెల్లించాలి. స్టేడియంలో భూగర్భ జలాల వినియోగంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) లేవనెత్తిన అభ్యంతరాల నేపథ్యంలో సిరీస్ నిర్వహణకు అవసరమైన అనుమతులు పొందినట్లు విజయ్ షా తెలిపారు.

Printed, published and owned by Adula Thirupathi, printed at Ramani web offset printers, H.NO 8-82/11/1,Auto Nagar, Bommakal Road, village, mdl & Dist : Karimnagar 505001,Telangana,
Published from, 8-1-141, Giddheperumandla Nagar Road, Karimnagar, Telangana, **Editor : Gaddam Ravi.** Email: vemulawadavaartha@gmail.com. RNI NO. TEL TEL /2017/71143